క్లుప్తంగా

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 10 తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సబితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పత్రాలను పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు.

కనుల పండువగా ఏకాదశి మహాయజ్ఞం



ఏకాదశి మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కట్టంగూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి మహాయజ్ఞాన్ని ఆలయ పూజారి శ్రీరామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించిన అనంతరం వచ్చే తొలి ఏకాదశిని మంచి రోజుగా భావించి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామి, కనకదుర్గాదేవి, శ్రీచక్రం, శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కడవేరు మల్లికార్జున్ కృష్ణవేణి, రెడ్డిపల్లి సైదులుసైదమ్మ, ఇల్లెందుల కృష్ణమూర్తి మణెమ్మ, కొత్త రాంమూర్తి శోభ, రాపోలు వెంకటేశ్వర్లు లక్ష్మి, జెల్లా అంజమ్మ, రాజ్యలక్ష్మి, పెంటమ్మ, ఇందిరమ్మ, ప్రవళిక పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చండూరు: నల్లగొండ జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చండూరు సీఐ వెంకటయ్య తన కార్యాలయం ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఉప్పరబోయిన భగవంతం, కొత్త గంగాధర్‌గౌడ్, బొడ్డు సతీష్‌గౌడ్, ఇడికోజు వెంకటాచారి, మొగుదాల వెంకటేష్‌గౌడ్, వర్కాల కిరణ్, తుమ్మల ఆంజనేయులు, పిట్టల రాంబాబు, మాధగోని రమేష్, ఆడెపు శంకర్, ఎరుకల వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు అందజేత

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 25 మంది క్రీడాకారులకు గంటిగంపు భిక్షమయ్య, సత్తెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు రవీందర్, లెనిన్ రూ.25 వేల విలువైన స్పోర్ట్స్ కిట్లను ఆదివారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు, కోచ్ మద్ది కరుణాకర్, కౌన్సిలర్లు గోగుల శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి విద్యారత్న అవార్డులు



లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాచమల్ల శ్రీనివాస్

శాలిగౌరారం: నల్లగొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన పుడమి సాహితీ వేదిక 5వ వార్షికోత్సవంలో శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన రాచమళ్ల శ్రీనివాస్ విద్యారత్న అవార్డు అందుకున్నారు. విద్యార్థుల కెరీర్ డెవలప్‌మెంట్‌కు ఆయన చేసిన కృషికి గాను ఆయన ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్ జానీ అఫ్జన్, ప్రధాన కార్యదర్శి కత్తుల హరి తదితరులు పాల్గొన్నారు.

రాధారపు భిక్షపతికి..

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లికి చెందిన విద్యావేత్త రాధారపు భిక్షపతి కూడా పుడమి సాహితీ వేదిక వారి విద్యారత్న అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకన్నారు. భిక్షపతిని జనభారతి సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు చొల్లేటి బ్రహ్మాచారి, దాసోజు జ్ఞానేశ్వర్, పెరుమాళ్ల ఆనంద్ తదితరులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న రాధారపు భిక్షపతి

అద్దె భవనాలతో అవస్థలు

- ఇరుకు గదుల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణులు
- సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి

మునుగోడు: మండలంలోని చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే నడిపిస్తున్నారు. అద్దె భవనాల్లో కూడా సరైన వసతులు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

55 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే..

మునుగోడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మునుగోడు, చండూరు, చిట్యాల మండలాల్లో గల గ్రామాల్లో మొత్తం 169 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 149 మెయిన్ కేంద్రాలు కాగా.. 20 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 7234 మంది చిన్నారులు, 1113 మంది గర్భిణులు, 1025 మంది బాలితలు నిత్యం పౌష్టికాహారం పొందుతున్నారు. మొత్తం 169 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను కేవలం 33 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 81 అంగన్‌వాడీ కేంద్రాలను మూతపడిన ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో కొనసాగిస్తున్నారు. 55 కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం కూడా వాటికి అద్దె రూపంలో పట్టణ కేంద్రాల్లో నెలకు రూ.1000, గ్రామాల్లో



మునుగోడులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

రూ.750 మాత్రమే చెల్లిస్తుండటంతో సరైన వసతులు ఉన్న భవనాలు అద్దెకు దొరకడం లేదు. ఇరుకుగా ఉండి, మరుగుదొడ్లు లేని భవనాలను మాత్రమే ఇస్తున్నారు.

అద్దె, ఇతర భవనాల్లో సమస్యలు ఇవీ..

అద్దె భవనాలతో పాటు కమ్యూనిటీ హాళ్లు, మూసివేసిన స్కూళ్లలో కొన్నింటికి విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు ఆరుబయటే మల మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. ఇరుకు గదులు ఉండటంతో ఒకే గదిలో 20 నుంచి 30 మంది చిన్నారులని కూర్చోబెట్టాల్సి వస్తుంది. పౌష్టిక ఆహారం తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు వస్తే కనీసం కూర్చునేందుకు స్థలం కూడా కరువైంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

తక్కువ అద్దెకు ఇవ్వడం లేదు



సొంత భవనం లేకపోవడంతో మా అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. మునుగోడు పట్టణ కేంద్రం కావడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1000 అద్దెకు అన్ని సౌకర్యాలు కలగిన భవనం ఎవరూ ఇవ్వడం లేదు. దీంతో పాత భవనం అద్దెకు తీసుకున్నాం. – పగిళ్ల పద్మ, మునుగోడు అంగన్‌వాడీ కేంద్రం–2 కార్యకర్త

సొంత భవనాలు నిర్మించాలి



అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో ఆ కేంద్రాలకు వచ్చే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరుచేసి ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి. – మిర్యాల వెంకన్న, సర్పంచ్, మునుగోడు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నాగం వర్షిత్‌రెడ్డిని సన్మానిస్తున్న మర్రిగూడ మండల నాయకులు



వర్షిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నకిరేకల్ మండల నాయకులు

మర్రిగూడ: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన నాగం వర్షిత్‌రెడ్డిని ఆదివారం మర్రిగూడ మండల బీజేపీ నాయకులు నల్లగొండలో కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార గోపాల్, గాదరి జంగయ్య, నాగిళ్ల సైదులు, గ్యార యాదగిరి తదితరులు ఉన్నారు.

సన్మానించిన నకిరేకల్ మండల నాయకులు..

నకిరేకల్: నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వర్షిత్‌రెడ్డిని పార్టీ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అప్పం అంజయ్య, వనం వేణు, వంగూరి సైదులు, కోలూరి జానయ్య, సిద్దోజు ఉపేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కేతేపల్లి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ ఎస్. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కేతేపల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను ఆయన సందర్శించి ఓటరు దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు నమోదుపై గ్రామాలలో అవగాహన కల్పించి ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులను పక్కాగా చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు.

46 దరఖాస్తుల స్వీకరణ..

మర్రిగూడ: మండల వ్యాప్తంగా రెండు రోజులు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 46 మంది ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లి, కొండూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఆర్ఐ బషీర్ అలీ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ 1993-94 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్

చిట్యాల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు యాదయ్య, గోవర్ధనాచారి, మల్లికార్జున్, నర్సింహాచారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. భవిష్యత్తులో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పానుగోటి నాగేశ్వర్‌రావు, తోకల సత్తిరెడ్డి, చింతపల్లి నర్సింహ, తిరుపాల యాదగిరి, మన్నెం సైదులు, యేళ్ల చంద్రశేఖర్, ఇబ్రహీం, పోశబోయిన సైదమ్మ, ఇమ్మడి జ్యోతి, మంజుల, నాగమణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి

చండూరు: బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థుల విజయం ఖాయమని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండమడుగు రాజు అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలో నిర్వహించిన బీఎస్పీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గంలో 307 పోలింగ్ బూత్‌లు ఉండగా ఒక్కో బూత్‌కు ఐదు నుంచి పది మంది కార్యకర్తలను కేటాయిస్తే గెలుపు సులభంగా ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నేరళ్ల ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శంకర్‌రెడ్డి, ఐతరాజు అభయందర్, ఈస్ట్ జోన్ మహిళా కన్వీనర్ పోకల ఎలిజబెత్, జిల్లా అధ్యక్షుడు ఏకుల రాజారావు, జిల్లా కోశాధికారి నాగేంద్రబాబు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలకరాజు శివ, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఏర్పుల అర్జున్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



నకిరేకల్: షటిల్ పోటీలను ప్రారంభించి ఆడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూర్: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య స్మారకార్థం నకిరేకల్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ మినీ స్టేడియాన్ని, ఇండోర్ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నోముల నర్సింహయ్య ప్రజల మనిషి అని కొనియాడారు. ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు కొండ యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు బొజ్జ సుందర్, నాగులంచ వెంకటేశ్వరరావు, నోముల గోవిందరాజులు, యాట మధుసూదన్‌రెడ్డి, మర్రూర్ సర్పంచ్ వలిశెట్టి స్వప్నశ్యాం, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, యాసారం లక్ష్మీవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నకిరేకల్ పట్టణంలోని డీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. గత 10 ఏళ్లుగా విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బి. వెంకటేశం, మండల శాఖ అధ్యక్షుడు యాకూబ్ అలీ, ప్రతినిధులు పోతుల భూపాల్, సైదులు, నరసింహాచారి, జనార్దన్‌రెడ్డి, మహేశ్వర్, యాదగిరి, మల్లికార్జున్, అంజయ్య, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెంలో కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రివర్ నిమ్స్ హాస్పిటల్ నల్లగొండ, సుందరయ్య విజ్ఞాన సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు 800 రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ నాబార్డు డీడీఎం ఎం. వినయ్‌కుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, నకిరేకల్ ఉద్యానవన శాఖ అధికారి రావుల విద్యాసాగర్, ఐఆర్‌డీఏస్ రమేష్‌రెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, మాజీ జెడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, డైరెక్టర్లు పాల్వాయి లింగారెడ్డి, ధర్మారెడ్డి, అనంతరెడ్డి, కొమ్మురాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ: పట్టణంలోని బీట్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో ఆదివారం ఆర్యవైశ్యులతో కలిసి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అబ్బగోని రమేష్ మాట్లాడుతూ.. బీట్ మార్కెటలక్ష వాసవీ దేవాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన నాన్ వెజ్ మార్కెట్ స్థానంలో పూల మార్కెట్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల మనోభావాలను, ఆత్మగౌరవాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవాధీనం, మాజీ వార్డు కౌన్సిలర్ మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, టీటీడీ అడ్వైజరీ బోర్డు మెంబర్ తేలుకుంట్ల శ్రీనివాస్, పారేపల్లి శ్రీనివాస్, రేపాల భద్రాద్రి, గోవిందు బాలరాజు, వందనపు వేణు, అర్థం శ్రీనివాస్, యామ మురళి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అబ్బగోని రమేష్, ఆర్యవైశ్యులు

పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించాలి

నార్కట్‌పల్లి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగనున్న ఎన్నికలో అత్యధికంగా ఓటరు నమోదు చేయించాలని కోరారు. మూసీ నది నుంచి అక్రమంగా ఇసుకను హైదరాబాద్ తరలిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, పెంపటి శ్రీను, అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సంబంధిత రోగాల నుంచి కాపాడుకోవాలి

మర్రిగూడ: కిడ్నీ సంబంధిత రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీఎంఆర్ ఎన్ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మర్రిగూడ మండలం సరంపేట పరిధిలోని తండాలో కిడ్నీ రోగుల గుర్తింపునకై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ బృందం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి దాదాపు 50 రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆహారం, తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. కార్యక్రమంలో వైద్యులు హాస్సేన్, ప్రీతి, హిమబిందు, లోకేష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సరంపేట తండాలో నీటిని సేకరిస్తున్న వైద్యులు

కోలాహలంగా రాములోరి ఊరేగింపు



నకిరేకల్: రాములోరి ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు, భక్తులు



చండూరులోని శ్రీసీతారామస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న భక్తులు

నకిరేకల్: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నకిరేకల్ పట్టణంలో అన్ని దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపును ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. పట్టణ ప్రజలు పెద్దఎత్తున కాషాయ జెండాలు పట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా దేవాలయాల చైర్మన్లు ఉప్పల సంతోష్, బ్రహ్మదేవర పద్మావతి, కోటగిరి శ్రీనివాస్, నూకల రఘునందన్‌రెడ్డి, కాసం లింగయ్య, కందాల శోభారాణి, వీర్లపాటి జయమ్మ, గర్రె మురళి, గర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన భక్తులు

చండూరు: అయోధ్యలోని రామమందిరంలో సోమవారం బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధానమంత్రి పిలుపు మేరకు ఆదివారం చండూరు పట్టణంలోని శ్రీసీతారామస్వామి దేవాలయ పరిసరాలను భక్తులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉభయ దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం, మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తడకమళ్ల శ్రీధర్, పట్టణ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పందుల సత్యం, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు కొలుగూరి రాంగోపాల్, సాగర్, నల్ల సత్యనారాయణ, భావన ఋషి, చెరుపల్లి కృష్ణ, చెరుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతల పంపిణీ

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామంలో శ్రీరామాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య రామమందిరం అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలు పంపిణీ చేశారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం అయోధ్య రామమందిరం అక్షింతలను బీజేపీ నాయకులు, భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రల మల్లేష్, పెద్ది సతీష్, సిద్దగోని మల్లికార్జున్, అంతటి రామకృష్ణ, బత్తిని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిక సాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన సింగె అంజనేయులు(40) గుండెపోటుతో మృతిచెందాడు. ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు అంజనేయులు భౌతికకాయానికి నివాళులర్పించి అతడి కుటుంబానికి రూ.16వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ రాచమల్ల జానయ్య, మండల కాంగ్రెస్ నాయకులు నాగంపల్లి శ్యాం, అర్రూరి రాములు, సాపిడి రామకృష్ణ, ధర్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

నకిరేకల్: మండలంలోని చందుపట్లలో గ్రామానికి చెందిన వరుస భిక్షం దశదిన కర్మ సందర్భంగా వారి కుటుంబానికి ఆదివారం స్థానిక ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న రూ.50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు గోనె నర్సింహారావు, సంద్ర సైదులు, కోరవి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘానికి రాజీనామా

నల్లగొండ టౌన్: తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘానికి తాను రాజీనామా చేసినట్లు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి చామల కిశోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను గెజిటెడ్ ఉద్యోగిగా పదోన్నతి పొందినందున సంఘంలో ఉండేందుకు అర్హుడిని కానందున రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

ప్లైవుడ్ దుకాణంలో మంటలు

నల్లగొండ క్రైం: పట్టణంలోని రామగిరిలో గల ఓ ప్లైవుడ్ దుకాణంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో షాపులో సామగ్రి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.25లక్షల నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని పోలోజు రామకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

నాంపల్లి: అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని టెట్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిరుదోజు దామోదరాచార్యాదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో టెట్ క్వాలిఫై అయిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

లెక్చరర్ల గొడవపై విచారణ జరిపించాలి

నల్లగొండటౌన్: దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన లెక్చరర్ల గొడవపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు సురేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులను పాస్ చేయిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి పంచుకునే విషయంలో గొడవపడిన లెక్చరర్లతో పాటు, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని డీఐఈఓపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కప్పల లింగయ్య(65) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు ఆదివారం లింగయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం పెర్కకొండారం గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, ఎంపీటీసీ నోముల జనార్దన్ తదితరులు ఉన్నారు.

మీర్ తురాబ్ అలీఖాన్ జయంతి

రామగిరి(నల్లగొండ): ముస్లిం మైనారిటీ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలో నిర్వహించిన మీర్ తురాబ్ అలీఖాన్(సాలార్ జంగ్–1) 195వ జయంతి కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు కౌన్సిలర్ మాతంగి సత్యానారాయణ, అమీర్, నజీర అజాం, రియాజ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

24న స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ

మర్రిగూడ: మండల పరిధిలోని కొట్టాల గ్రామంలో సహస్ర వేదిక్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఈ నెల 24న ఆవిష్కరించనున్నట్లు కమిటీ సభ్యుడు కల్లెట్ల అరుణ్‌సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ విగ్రహావిష్కరణకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపాడు. ఎమ్మెల్యేతో పాటు విగ్రహ దాత, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, దేవినేని లక్ష్మి, గడ్డం నర్సింహాగౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నాడు.

పూజలు, భజనలు చేయాలి

నాంపల్లి: అయోధ్య రామామందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని ప్రతి దేవాలయంలో ప్రజలు పూజలు, భజనలు చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రముఖులు కర్నాటి శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఇంటికి మామిడి తోరణాలు కట్టి దీపారాధన చేయాలని అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు, హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నకిరేకల్: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన వంటిపాక మోశ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మోశ భౌతికకాయానికి స్థానిక వార్డు కౌన్సిలర్ దైద స్వప్న, టీపీసీసీ నేత దైద రవీందర్ నివాళులర్పించి మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా మాస కల్యాణం

నకిరేకల్: పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి మాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల సంతోష్‌కుమార్, మాజీ చైర్మన్ ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మర్రిగూడ: మండలంలోని ఖుదాబాక్షపల్లిలో పీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పందుల పాండుగౌడ్, ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మగిరీష్, నాయకులు తోకల నరేష్, బొడ్డుపల్లి సైదులు, యువకులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద 65 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కేతేపల్లి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి లోడుతో వెళ్తున్న వాహనాలను, ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులను పోలీసులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.